క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీ తిరుపతమ్మ తల్లికి బోనాలు



బెల్లంకొండ: శ్రావణమాసం సందర్భంగా మండల కేంద్రంలోని యాదవుల బజారులోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో బోనాల పండుగను ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పొంగళ్లు చేసి, బోనాలను ఎత్తుకొని నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, లావణ్య దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ పాడిపంటలతో సంతోషంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, సర్పంచ్ గడిపర్తి జ్యోతి సముద్రం, పీఏస్కే మస్తాన్ షరీఫ్, వర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వీరాస్వామికి జాతీయ సేవారత్న పురస్కారం



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన గంజి వీరాస్వామి ఆదివారం ఒంగోలులో ఎల్‌సీఈఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సేవా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో కూచిపూడి నాట్య సమ్మేళనంలో పురస్కారం అందుకున్నారు. 23 సంవత్సరాలుగా అందిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గాను ఈ పురస్కారానికి ఎంపికైనట్లు వీరాస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వీరాస్వామికి కట్టా శివదుర్గారావు, వంగర మధు, కాకుమాను కుమార్, చిల్లాపల్లి శ్రీనివాసరావు, చొప్పా సుబ్బారావు, బిట్రా పానకాలు, కేశనం నాగార్జునలు అభినందనలు తెలిపారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



అమరావతి: మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా గౌరవాధ్యక్షుడు బంధం రావూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం బీపీ మండల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బంధం రావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాబు బిందు ప్రసాద్ మండల్ బిహార్ ముఖ్యమంత్రిగా పని చేసి అణగారిన వర్గాల వారి హక్కుల కోసం పోరాటాలు చేసిన మహనుభావుడన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంట్ సభ్యుడిగా పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు షేక్ పీర్ సాహెబ్‌బ్ బత్తుల గోవర్దన్, శ్రీనివాస నాయక్, గంజి శ్రీనివాసరావు, మిట్ట వెంకటేశ్వరరావు రాము నాయక్, బుల్ల రవి తదితరులు పాల్గొన్నారు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్



గురజాల : నగర పంచాయతీ పరిధిలో ఆదివారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరిగిందని కమిషనర్ మోహన శ్రీనివాస్ తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా మురుగు కాలువల్లో చెత్త చెదారం శుభ్రం చేయడంతోపాటు అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించడం, దోమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ వంటివి చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీ సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు.

రైల్వే బ్రిడ్జి గడ్డర్లు ఏర్పాటు



పిడుగురాళ్ల: పట్టణంలోని అద్దంకి నార్కెట్‌పల్లి బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి రెండవ వైపు పనులు పూర్తి కావచ్చాయి. ఆదివారానికి రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి ఆరు గడ్డర్ల ఏర్పాటుకు ఐదు గడ్డర్లను ఏర్పాటు చేశారు. పొక్లెయిన్ల సహాయంతో నాలుగు, ఐదు రోజుల నుంచి ఈ రైల్వే బ్రిడ్జిపై గడ్డర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఒక వైపు పూర్తి చేయటంతో వాహనాల రాకపోకలు నిర్వహిస్తూనే రెండవ వైపు ఈ రైల్వే గడ్డర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణానికి ఎటువంటి ఆటంకం కలగకుండా నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే, రైల్వే అధికారుల ఉమ్మడి నేతృత్వంలో ఈ రైల్వే గడ్డర్ల ఏర్పాటు పనులు నిర్వహిస్తున్నారు. గడ్డర్ల ఏర్పాట్లు పూర్తి అయితే అద్దంకి నార్కెట్‌పల్లి హైవే బ్రిడ్జి పూర్తి అయినట్లే.

మహిళలకు భద్రత అవసరం ఎంతైనా ఉంది



మహిళలపై హత్యాచారాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రాణాలు పోసే డాక్టర్లు, సిబ్బందికే రక్షణ కరవైతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటి..? కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన దేశం మొత్తాన్ని కుదిపేసింది. రోజు ఏదో ఒకచోట అబల బలైపోతూనే ఉంది. ఇలాంటివి పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలి. మహిళలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– అరెపీ బాషా, హెల్త్ సూపర్‌వైజర్, పీహెచ్‌సీ, చంద్రాజుపాలెం

వైద్య సేవకుల మనోధైర్యం దెబ్బతింటోంది



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన బాధాకరం. ఇలాంటి ఘటనలతో సేవకుల మనోధైర్యం దెబ్బతింటోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంది. వైద్య సేవలు అందించే డాక్టర్లు, సిబ్బంది రక్షణకు అధికార యంత్రాంగం పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రులలో భద్రతను కట్టుదిట్టం చేయాలి. నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలి.

– ఆది జ్యోతి, ఏఎన్‌ఎం, మన్నెసుల్తాన్ పాలెం, బెల్లంకొండ

చదువుకు చక్కని వేదిక.. ఓపెన్ స్కూల్

- టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్
- రెగ్యులర్ కోర్సులతో సమానంగా గుర్తింపు
- ఈ నెల 28 వరకు ప్రవేశాలకు గడువు
- అపరాధ రుసుంతో సెప్టెంబర్ 4 వరకూ దరఖాస్తుల స్వీకరణ



దూరవిద్య ద్వారా పాఠ్యాంశాలు వింటున్న విద్యార్థులు

బెల్లంకొండ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ) దూరవిద్య విధానం ద్వారా పది, ఇంటర్ కోర్సులను ఏటా నిర్వహిస్తోంది. 2024–25 విద్యా సంవత్సరానికి పది, ఇంటర్ అడ్మిషన్లకు ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ నోటిఫికేషన్ జారీ చేసింది. చదువుకోవాలని ఉన్నప్పటికీ కుటుంబ పరిస్థితులు, పేదరికం కారణంగా అనేక మంది చదువుకు దూరం అవుతున్నారు. బడి మధ్యలో మానేసిన యువత, వయోజనులు చదువుకునేందుకు ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానం తీసుకు వచ్చింది.

- పది పరీక్షలు రాసేవారు నిర్ణీత ఐదేళ్లలో గరిష్టంగా 9 సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులు అవ్వాలి. అలా ఉత్తీర్ణులు కాకపోతే తిరిగి అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది.
- ఇంటర్ పరీక్షలు రాసేవారు పది పాస్ అయి రెండేళ్ల వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులు ఒకేసారి రాసుకోవచ్చు, రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక్క సబ్జెక్టు రాయాల్సి ఉంటుంది.
- ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులయ్యాక డిగ్రీ, పీజీ తదితర కోర్సులతోపాటు పోటీ పరీక్షల్లో ప్రతిభను చాటుకునే అవకాశం ఉంది. ఎంసెట్, డీఈఈ సెట్‌తో పాటు ఇంటర్ అర్హతతో అన్ని ఉద్యోగాలకు అర్హులవుతారు.
- పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో దూర విద్య ద్వారా చదువుకునేందుకు 18 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గ్రామాలలోని సచివాలయాలలోనూ అడ్మిషన్లు పొందవచ్చు.

దరఖాస్తు ఇలా...

జూలై 31వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 28లోగా అడ్మిషన్ పొందవచ్చు. రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 4వ తేదీ వరకు అవకాశం ఉంది.

- పదో తరగతికి జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,550, అన్ని వర్గాల మహిళలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పీహెచ్‌సీ పురుషులు రూ.1,150 చెల్లించాల్సి ఉంటుంది.
- ఇంటర్ జనరల్ పురుషులకు రూ.1,800, అన్ని వర్గాల మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది.

సబ్జెక్టులు ఇవీ...

- పదో తరగతికి గ్రూప్‌–ఏలో ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, ఒరియా తీసుకోవచ్చు. గ్రూప్‌–బీలో గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి.
- ఇంటర్‌కు గ్రూప్‌–ఏలో ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, ఒరియా, గ్రూప్‌–బీలో ప్రధాన సబ్జెక్టులతో కలిపి ఐదు సబ్జెక్టులతో పూర్తి చేసుకునే అవకాశం ఉంది.
- ప్రవేశం పొందిన తర్వాత స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు. ప్రతి ఆదివారం, ప్రతి నెలా రెండో శనివారం అధ్యయన కేంద్రాల్లో 30 కాంటాక్ట్ తరగతులు నిర్వహిస్తారు. కనీసం 24 కాంటాక్ట్ తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో వార్షిక పరీక్షలకు అనుమతిస్తారు.

రెగ్యులర్ విద్యార్థులకు అవకాశం...

రెగ్యులర్‌గా స్కూళ్లు, కాలేజీల్లో పది, ఇంటర్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్న వారు ఓపెన్ స్కూల్లో చేరి సులభంగా ఉండే సబ్జెక్టులు ఎంపిక చేసుకుని పాస్ అయ్యే అవకాశం ఉంది.

- రెగ్యులర్ పది, ఇంటర్ చదివి ఫెయిల్ అయినప్పటి నుంచి ఐదేళ్ల లోపు ఓపెన్ స్కూల్లో చేరితే రెగ్యులర్‌గా పాస్ అయిన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెక్టుల మార్కులు బదలాయించుకునే అవకాశం కూడా ఉంటుంది.
- పదిలో హిందీ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలు రాస్తే సరిపోతుంది.

అర్హతలు ఇవీ...

- పదవ తరగతికి ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాలు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు. చదవడం, రాయడం తెలిసి ఉండాలి. దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టిన తేదీ ధ్రువపత్రం ఉండాలి.
- ఇంటర్‌లో చేరడానికి పదవ తరగతి మార్కుల జాబితా, టీసీని దరఖాస్తుతో జత పరచాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు వైకల్య ధ్రువీకరణ పత్రం జత చేయాలి. ఇతర సమాచారం కోసం ఓపెన్ స్కూల్ వెబ్ సైట్‌లో తెలుసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి.



చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ విద్య ఓ వరం. ఈ ఏడాది ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. నెలాఖరు వరకు గడువు ఉంది. ఇంటర్నెట్ సెంటర్లు, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అడ్మిషన్ల పెంపునకు అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ రూపొందించాం. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి జారీ చేసే సర్టిఫికెట్లు, రెగ్యులర్ విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లతో సమాన గుర్తింపు ఉంటుంది. అన్ని మండలాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అడ్మిషన్లు చేయించేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కాకుండా ఎక్కువగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– కేఎంఏ హుస్సేన్, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్, పల్నాడు

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే గేటు వద్దనున్న ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో సాయికృష్ణ డెంటల్ కేర్ హాస్పిటల్ వైద్యులు పోట్ల శివరామకృష్ణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా రోజుకు రెండు సార్లు దంతాలను శుభ్ర పరచుకోవాలని సూచించారు. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుందని, ప్రభుత్వ సదుపాయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ దంత సంరక్షణ.. ఆరోగ్య రక్షణ అని చెప్పారు. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో బీసీ బాలుర వసతి గృహ సంరక్షణ అధికారి రత్నబాబు, ఫౌండేషన్ సభ్యులు అంజి, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పెదకూరపాడు: మండల కేంద్రమైన పెదకూరపాడు నుంచి గుంటూరు వెళ్లే రోడ్డులో గ్రామ పొలిమేరలో 11 మంది పేకాట రాయుళ్లను పెదకూరపాడు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పెదకూరపాడు పోలీసులు తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి 11 మంది పేకాటరాయుళ్లను, రూ.9,910 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి సోమవారం సత్తెనపల్లి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ బాలు నాయక్ తెలిపారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే



బ్రాహ్మణపల్లిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాజుపాలెం: వాతావరణంలో వచ్చిన మార్పుల వలన గ్రామాలలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితులను నివారించేందుకు రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామాలలో జ్వరాల సర్వేను నిర్వహిస్తూ గ్రామస్తులకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్ శని, ఆదివారాలు గ్రామంలో ప్రతి ఇంటిని పరిశీలించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గత కొంత కాలం నుంచి గ్రామాలలో చెత్తను సేకరించే గ్రీన్ అంబాసిడర్‌లు లేకపోవడం వలన ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్వాసనలు వెదజల్లడమే గాక దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్య సిబ్బంది ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వేను చేపట్టారు. సైడు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి బ్లీచింగ్, సున్నంను చల్లుతున్నారు. సైడు కాలువల్లో దోమల లార్వాను నిర్మూలించేందుకు ఎబెట్ పిచికారీ చేస్తున్నారు. గ్రామాలలోని చేతి పంపుల నీళ్లకు పరీక్షలు నిర్వహించి కలుషితమైన చేతి పంపులను మూయించి దండోరా వేయిస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో ఐదువేల గృహాలను సర్వే చేశారు. వరుసగా రెండు రోజులు జ్వరం వస్తే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని మలేరియా అధికారి తెలిపారు.

ప్రధాని మోదీ ఆశయాన్ని నెరవేరుద్దాం

వెలుగు ఏపీఎం సలీం



లఖ్‌పతి దీదీ ధ్రువీకరణ పత్రాలతో మహిళలు

అచ్చంపేట: ప్రధాని మోదీ ఆశయానికి అనుగుణంగా మహిళలను లక్షాధికారులను చేసే విధంగా లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని స్థానిక వెలుగు కార్యాలయంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం సలీం మాట్లాడుతూ మహిళలందరినీ లక్షాధికారులను చేయడమే ప్రధాని మోదీ ఆశయమన్నారు. ఇందులో భాగంగా అచ్చంపేట మండలంలో 3,900 మంది మహిళలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపిక చేసిన మహిళలందరికీ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. మహిళలకు మొదటి విడతగా స్థానిక బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీపై రూ.40 వేలు ఇప్పించడం జరుగుతుందని.. ఆ రుణాన్ని సకాలంలో చెల్లిస్తే మలి విడతగా రూ.1,00,000 ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇలా సకాలంలో చెల్లించిన వారికి రుణాన్ని పెంచుకుంటూ పోవడం జరుగుతుందని చెప్పారు. మహిళలు తప్పనిసరిగా డ్వాక్రా సభ్యులై ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పద్మజ, సీసీ ఎస్కే సైదా, నరసింహారావు, సుభాని, అకౌంటెంట్ బాజీ, కోటేశ్వరి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వాసవి అమ్మవారి ఆలయ అధ్యక్షుడిగా భవనాసి



వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని పాత మాచర్లలోని ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయ అధ్యక్షులుగా భవనాసి వెంకటేశ్వరరావు ఎన్నికైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అధ్యక్ష ఎన్నిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత రెండేళ్లగా ఆత్మకూరి పూర్ణచంద్రరావు అధ్యక్షులుగా ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆర్యవైశ్యుల సహాయ సహకారాలతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్య పెద్దలు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ యలమంద, కంభంపాటి అనిల్‌కుమార్, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, పందిరి నరసింహారావు, చుండూరు సత్యనారాయణ, విడేల కృష్ణ, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ ఆత్మకూరి నారాయణ, మేడం శ్రీనివాసరావు, పోలా సత్యనారాయణ, యేలూరి విష్ణు, మేడం శివరామకృష్ణ, చెన్నకేశవరావు ఉన్నారు.

విశ్వాసంతో క్రీస్తును ఆరాధించాలి

విజయపురిసౌత్: విశ్వాసంతో క్రీస్తును ఆరాధిస్తూ సత్ప్రవర్తనతో మెలిగే భక్తులకు క్రీస్తు దీవెనలు తప్పకుండా అందుతాయని సాగరమాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసెఫ్ బాలసాగర్ ఉద్బోధించారు. విజయపురిసౌత్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయ విచారణ గురువులు జోసెఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నిర్వహించిన తేరు ప్రదక్షిణలో భక్తులు భారీగా పాల్గొన్నారు. భక్తులు తలనీలాలు సమర్పించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

పిడుగురాళ్ల: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనటంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న శివప్రసాద్ అతని భార్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని లెనిన్ నగర్‌కు చెందిన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఎస్‌ఐ మోహన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు డ్రైవర్ గౌరీనాథ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మోహన్ పేర్కొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో గ్రామ దేవత పోలేరమ్మ తల్లి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం భక్తులు భారీగా బోనాలతో తరలి వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఇటీవల గ్రామస్తులంతా ఐక్యంగా పోలేరమ్మ తల్లి ఉత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. భారీగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి భక్తులు నిత్యం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. చాలా ఏళ్ల తర్వాత పోలేరమ్మ తల్లి ఆలయం భక్తులతో కళకళలాడుతోంది.

గ్రామ దేవతలకు పూజలు

మాచవరం: మండలంలోని మాచవరం, పిన్నెల్లి, వేమవరం తదితర గ్రామాల్లో శ్రావణ మాస ఆదివారం పురస్కరించుకొని గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. మాచవరంలోని పాతపాటేశ్వరీ అమ్మవారికి, పిన్నెల్లి, వేమవరం గ్రామాల్లో ముత్యాలమ్మ తల్లికి గ్రామస్తులు బోనాలు సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. కుంకుమ బండ్లు ఏర్పాటు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ దేవతలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లికి బోనాలు



బోనాలు సమర్పించటానికి ఊరేగింపుగా వెళుతున్న భక్తులు



ముత్యాలమ్మతల్లి అమ్మవారు

పెదకూరపాడు: మండల పరిధిలోని 75త్యాళ్లూరు శాంతికాలనీలో వేంచేసి ఉన్న ముత్యాలమ్మ తల్లికి ఆదివారం గ్రామస్తులు బోనాల సమర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బేడ బుడగ జంగం వారు ప్రతి ఏడాది శ్రావణ మాసంలో ముత్యాలమ్మతల్లికి బోనాలు చెల్లించడం ఆచారంగా వస్తుందని కులపెద్దలు కిన్నెర అచ్చయ్య, భిక్షాలు తెలిపారు. సంచార జీవనం సాగిస్తూ సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు కూడా ముందురోజు గ్రామానికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం గ్రామంలో అన్ని దేవాలయాలను దర్శించి పసుపు కుంకుమలు చెల్లించారు. తమ కాలనీలో వీధులను, ఇంటి ముంగిళ్లను రంగవల్లులతో అలంకరించారు. మహిళలు ప్రతి ఇంటి నుంచి బోనంతో సామూహికంగా బయలు దేరి వచ్చి ముత్యాలమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద సంఖ్యలో పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి తోడ్పాటునందించాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు

అమరావతి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలకు అడ్డంగా ఉన్న మెమో నంబర్ 1214 రద్దు చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి తోడ్పాటు నందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని పల్నాడు జిల్లా భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అవ్వరు ప్రసాదరావు అన్నారు. ఆదివారం అమరావతి సీపీఎం కార్యాలయంలో అమరావతి మండల తాపీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు అందాల్సిన 12 రకాల సంక్షేమ పథకాలు రావటం లేదన్నారు. టీడీపీ ఎన్నికలకు ముందు భవన నిర్మాణ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందజేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. 60 ఏళ్ల నిండిన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పెన్షన్, వికలాంగ పెన్షన్, చదువుకోవడానికి స్కాలర్‌షిప్‌లు తదితర సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి సిలార్ మసూద్ సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు, సయ్యద్ మొహిద్దీన్ వలీలతో పాటు మండలంలోని తాపీ మేస్త్రిలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీలో ఉచిత మెడికల్ క్యాంపు



విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీని పురస్కరించుకుని సాగర్ పరివార్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. 400 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ క్యాంపులో బీపీ, డెంటల్, స్కిన్, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రో, రుమటాలజీ తదితర వైద్య పరీక్షలు చేశారు. 50 మందికి కళ్ల పరీక్షలు చేసి 20 మందికి కళ్లజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాగర్ పరివార్ ప్రెసిడెంట్ మల్లికార్జునరావు, జనరల్ సెక్రటరీ వీర నంది, ట్రెజరర్ విజయకుమార్, క్యాంపు కో–ఆర్డినేటర్ డాక్టర్ చక్రపాణి, వైస్ ప్రెసిడెంట్ సైదారెడ్డి, నాగచారి, పూర్వ విద్యార్థి రిటైర్డ్ డీజీపీ వెంకటేష్, దంత వైద్యులు వివేకానంద వర్ధన్, ప్రిన్సిపాల్ సరోజిని, పూర్వ విద్యార్థి రమేష్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.